# వార్డునంబర్ 5




**ఉమ**

గంట ఆరు గంటలు దాటినట్లుంది. హాస్పిటల్ ఆవరణలో వచ్చి పోయే వారి సందడి రోగుల మూలుగులతో మిశ్రమమై అల్లకల్లోలంగా ఉంది. వీటికి తోడు పోర్డు వార్డుకూ వచ్చి గంట గణగణ మ్రోగిస్తూ 'టైమయింది, ఇక దయ చేయండి' అంటూ హెచ్చరిక చేసి వెళ్ళిపోతున్న వార్డుబాయ్ అరుపులకు చెవులు గింగురుమంటున్నాయి.

వార్డునంబర్ 5 లో వెలుగు పోయి చీకటి ఆవరిస్తున్నది. స్టాఫ్‌నర్సు ఏలిస్ వాచీకేసి చూసుకుంది. యూనిఫారమ్‌లో చూచే వాళ్ళకంటికి మళ్ళీ మళ్ళీ చూడాలనే రూపురేఖలు ఆమెలో స్పష్టంగా కనుపిస్తున్నాయి. ఆమె తియ్యటి నవ్వు ఆ వార్డు రోగులకు తియ్యటి టానిక్! ఆమె డ్యూటీ మరొక్క గంట మాత్రమే. ఆ నాటి బాధ్యతలు తీరిపోయి విశ్రాంతి చిక్కే సమయం సమీపిస్తున్నది. కానీ, మనస్సులో పోరాటం జరుగుతూ ఉంటే మనిషికి నిజమైన విశ్రాంతి ఉంటుందా? ఎనిమిది గంటలకంతా క్వార్టర్సుకు వస్తానని థియేటర్ నుండి ఫోను చేసి మరీ చెప్పాడు డాక్టర్ అర్జున్‌దాస్. అతడు పేరు ప్రఖ్యాతులున్న గొప్ప సర్జన్. ఆమె అతని ప్రియురాలు. అంతకుమించి అతనికి ఏమీ కాలేని పరిస్థితి ఆమెది. డాక్టర్ అర్జున్‌దాస్ ఇష్టంలేని పెళ్ళి చేసుకున్నవాడు. ఒక బిడ్డకు తండ్రి కూడాను. భార్యను ప్రేమించలేకపోతున్నానని, ఆమె అతన్ని అర్థం చేసుకోలేదని ఏమిటో గోడు చెప్పుకుపోతూ ఉంటాడు. అతడు ఏది చెప్పినా శ్రద్ధగా, జాలిగా వింటుంది ఏలిస్. రెండేళ్ళ పరిచయం వారిది. క్రమంగా సన్నిహితులైనారు. అతని ఆవేదన ఏమిటో అర్థం చేసుకోవాలనే తాపత్రయంతో తన హృదయాన్నే అతనికి అర్పించుకున్నది ఏలిస్. అతన్ని తను కోరిందంటూ ఏమీ లేదు. అతడు తనకు వాగ్దానం అంటూ చేసింది ఏమీ లేదు. అయినా, మనస్సు నిండా అతన్నే నింపుకొని ఏ రోజు కారోజు నిరీక్షణలో, బరువైన మనస్సుతో, తపనతో అతని చెలిమి కొరకు ఎదురు చూడడం పరిపాటై పోయింది. రోజుకు గంటో, రెండు గంటలో అతనితో గడపడం, అర్థం లేని తన భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ సతమతమైపోతూ అసంతృప్తితో క్వార్టర్సుకు తిరిగి రావడం సంవత్సరంగా జరుగుతున్న దినచర్య!

వార్డునంబర్ 5 లో ఉన్న వారంతా బాధితులే కదా? మానసికంగానో, శారీరకంగానో మానవుడు సదా బాధ పడుతూనే ఉన్నాడు. తీరని సమస్యతో, అసంతృప్తితో, వ్యాధితో బ్రతకలేక బ్రతుకుతున్నాడు. తన బాధ దైవానికి ఒక లెక్కా?

"సిస్టర్!" కొన ఊపిరితో పిలిచాడు బెడ్‌నంబర్ 2! ఉలిక్కిపడి ఈ ప్రపంచంలోకి వచ్చింది ఏలిస్.

బెడ్‌నంబర్ టూ వారం రోజులుగా ప్రమాదస్థితిలో ఉన్నాడు. అతడొక నక్సలైటు. పేరు వివేక్ అయినా, అవివేకంతో, ఒళ్ళు తెలియని ఆవేశంతో నలుగుర్ని హత్య చేసిన హంతకుడని న్యాయస్థానం తీర్పు చెప్పింది. అతనికి కావలా ఇద్దరు పోలీసు జవానులు. లేచి నిలబడితే ప్రాణం పోయేటట్లు ఉంది అతనిపరిస్థితి. వారంరోజులుగాముక్కులో ఆక్సిజన్ గొట్టం 24 గంటలు ఉంటూనే ఉన్నది. ఒక వేళ ప్రాణం నిలబడినా, ఉరికంబం ఎక్కక తప్పదు! అయినా, ఇన్ని రోజులుగా అతని ప్రాణాన్ని నిలబెట్టడానికి తీవ్ర పోరాటమే చేశారు ఆ వార్డు డాక్టర్లు!! ప్రాణం నిలబెట్టడం వైద్యుని కర్తవ్యం!

"మాది విచిత్రమైన వృత్తి, సిస్టర్! బెడ్‌నంబర్ టూని బ్రతికించి ఉరికంబం ఎక్కించమంటుంది వైద్య శాస్త్రం! నిజంగా వివేక్‌ని బ్రతికించే కన్నా, ప్రాణం త్వరగా పోయేందుకు విషం ఇవ్వకూడదూ? కానీ, అలా జరగడానికి వీలులేదు. ఇదీ మా కర్తవ్యం!!" అంటాడు హౌస్‌సర్జన్ డాక్టర్ శేషాద్రి. ఇంకా ముదిరం కాని మనస్సుతో, శరీరంతో, ఆర్ద్రమైన భావాలతో, న్యాయబుద్ధితో సంచరిస్తాడు డాక్టర్ శేషాద్రి. అతడంటే ఏలిస్‌కు ఎంతో గౌరవం! తను డాక్టర్ అర్జున్‌దాస్‌తో స్నేహంగా ఉండటం అతనికి ఎంత మాత్రమూ ఇష్టం లేదని మాటల్లోను, భావాల్లోను ఎన్నోసార్లు వ్యక్తం చేశాడు డాక్టర్ శేషాద్రి. అతనికి ఎటువంటి జవాబూ చెప్పక తప్పుకు తిరుగుతుంది ఏలిస్.

"ఇంకా...ఇంకా ఎంత...కాలమో ...ప్రాణం...నిలబడి...ఉంటుంది . . . సిస్టర్?" అని హీనస్వరంతో, ఆయాసపడుతూ అడిగాడు వివేక్. జాలిగా అతని కళ్ళలోకి చూసింది ఏలిస్. త్వరలోనే అతని శరీరం హిందూసంప్రదాయం ప్రకారం భస్మమైపోతుంది కదా? బాధగా అతని చేతిని తన చేతిలోకి తీసుకుని స్నేహపూర్వకంగా నొక్కింది ఏలిస్.

"నువ్వు చాలా మంచి దానివి, ఏలిస్ నువ్వు దేవతవు ..." అన్నాడు వివేక్. అతని నోటి మీద వ్రేలుంచి, "ష్!" అని అన్నది బాధగా ఏలిస్.

"నీతో ఇంకెప్పుడూ మాట్లాడను, సిస్టర్! ఈ రా ... త్రి ... రాత్రి ... నేను తప్పిపోతానుగా?" అన్నాడు విచారంగా.

"తప్పు." ఏలిస్ హృదయం బాధతో బరువెక్కిపోయింది.

ఆమె చేతిని తన గుండెల మీద పెట్టుకున్నాడు వివేక్. ఏలిస్ కండ్లలో కన్నీరు గిరగిరా తిరిగింది. జీవితచక్రం తిరగటం మానదు, అతని గుండె ఆగిపోక తప్పదు.

అలా ఎంతసేపు నిలబడిందో వెనక నుండి డాక్టర్ వినాయక్— "గుడ్ ఈవెనింగ్, సిస్టర్!" అని చెబుతూ ఉంటే ఉలిక్కిపడింది.

"టీ నక్సలైట్ ఇంకా బ్రతికే ఉన్నాడా?!" అన్నాడు.

"పాపం, చాలా బాధపడుతున్నాడు, డాక్టర్! మార్ఫియా ఇవ్వనా?" అన్నది.

"చేసిన నేరానికి శిక్ష అనుభవిస్తున్నాడు, అనుభవించనీ!" అంటూ ముందుకు కదిలి వెళ్ళిపోయాడు డాక్టర్ వినాయక్!

అతని మాటలు స్పష్టంగా వినిపించాయి ఆ చనిపోతున్న నేరస్థునికి. 'శిక్షకనా? నల్ల బజారులో ప్రజల్ని పీడించి డబ్బు గుంజుకుంటున్న రాక్షసుల్ని, తిండి అవసరం దానికి కాదన్నదానికి అంతం పెడుతుంటూ పెద్దమనుష్యుల్లా చెలామణీ అవుతున్న దుర్మార్గుల అంతం చేసినందుకా శిక్ష? అటువంటి వారికి శిక్ష అంటూ లేక, వారి ఆగడం రోజురోజుకూ పెచ్చుపోయి ప్రజలు చితికిపోతూనో, ఆకలితోనో అలమటించిపోతూ ఉంటే చూస్తూ ఉండిపోవాలా? యుద్ధంలో శత్రువులను చంపడంలేదా? మరి వీళ్ళు మన దేశానికి శత్రువులుకారా? శత్రువులను చంపినందుకా శిక్ష? తన మెడలో "మహావీరచక్ర" బిరుదుతో పొదగబడిన బంగారు పతకం దండగా వేయడానికి బదులు ఉరిత్రాడా? ఇదేనా న్యాయం? ఇదేనా తీర్పు?' గట్టిగా నవ్వాడు వివేక్. ఆ నవ్విన నవ్వుకు గుండెల్లో పోటు మరీ ఎక్కువై మెలికలు తిరిగిపోయాడు.

"ఇంజెక్షన్ ఇస్తానుండు" అంటూ పరుగెత్తింది ఏలిస్.

చాలాసేపటికిగాని తనతో రౌండ్సుకు రానందుకు ఏలిస్ మీద విసుక్కున్నాడు డాక్టర్ వినాయక్. ఏలిస్ మనస్సంతా బెడ్ నంబర్ టూ మీదే లగ్నమై పోయి ఉంది. అతడు ఎక్కువకాలం బ్రతకడు! అయినా, వార్డు నంబర్ 5 క వచ్చిన వారంతా ఫోటీ ప్రయాణికుల

> **స్వప్న భంగం**
>
> పురుషులు పెళ్ళి అయ్యే వరకు కలలు కంటుంటారు. పెళ్ళి కాగానే నిద్ర మేల్కొని యథార్థాన్ని దర్శిస్తారు!
>
> —షా

వంటి వారే కదా! ఎప్పటికైనా విడిపోవలసిన వారే! జీవించినా, మరణించినా వారి గమ్యస్థానాలు వేరు. ఈ వార్డులో మమకారాలకీ, మమతలకూ తావు లేదు. ఎలాగో మనస్సు గట్టి చేసుకొని డాక్టర్ వినాయక్ వెంట రౌండ్సుకు వెళ్ళింది ఏలిస్.

బెడ్ నంబర్ ఆరు వద్ద చాలాసేపు ఆగిపోయాడు డాక్టర్ వినాయక్.

"ఇది చాలా చిత్రమైన కేసు" అంటూ రోగిని చాలా సేపు పరీక్ష చేసి చూశాడు.

"ఓహో! ఈ కేసు ఆటాప్సీ చేయ గలిగితే ఎంత అదృష్టం, సిస్టర్! ఎందుకన్నా మంచిది బంధువుల వద్ద పెర్మిషన్ తీసుకోండి" అన్నాడు.

"అదేమిటి డాక్టర్! గోపాల్ బ్రతుకుతాడనుకుంటున్నాముగా?!" సందేహంగా, ఆశ్చర్యపోతూ అడిగింది ఏలిస్.

"అటువంటి అవయవాలని పరిశోధించే ఛాన్స్ దొరికితే ఎంత బాగుంటుంది! సిస్టర్, మన దేశంలో రీసెర్చ్ సైన్సుకి రావాలంటే ఇటువంటి కేసుల్ని ఆటాప్సీ చేయాలి' అంటూ ఏవేవో మాట్లాడుతూ ముందుకు పోయాడు డాక్టర్ వినాయక్.

పచ్చాలగేళ్ళు నిండీనిండని పయస్సు గోపాల్‌ది చిరునవ్వుతో, మిలమిలలాడే కళ్ళతో ఎప్పుడూ స్వాగతం చెబుతూ ఉంటాడు. తల్లిదండ్రులకు ఒక్కడే బిడ్డ గోపాల్! అటువంటి గోపాల్ మృత కళేబరం 'మార్చురీ' బల్లమీద ... అప్పైన ఊహించలేకపోయింది ఏలిస్. ప్రాణం దేవినట్లయింది తనకు. రోగి కోలుకుంటాడని అందరూ సంతోష పడుతూ ఉంటే, డాక్టర్ వినాయక్ మాత్రం పీనుగను కోసి పరీక్ష చేస్తే బాగుంటుం దనుకుంటున్నాడు! ఏలిస్‌కు అతన్ని చూస్తూ ఉంటే అసహ్యం వేసింది. 'డాక్టరుకు హృదయం లేదా?' అనుకుంది.

అతను చెప్పినదంతా వ్రాసుకుంటూ రౌండ్సు ముగించేసరికి ఏడు గంటలు దాటింది. నైట్‌డ్యూటీకి వచ్చే నర్సు సరోజ ఇంకా రాలేదు. ఏలిస్ మనస్సు సరోజ మీదకు మళ్ళింది. తల్లినీ, ఇద్దరు తమ్ముళ్ళనూ, ఇద్దరు చెల్లెళ్ళను కష్టపడి పోషిస్తున్నది సరోజ. వాళ్ళ ఇంటికి ఆధారం, వాళ్ళ ప్రాణానికి ఊపిరి సరోజే! తన వాళ్ళను బాగా పైకి తీసుకు రావాలని ఎన్నో విధాలుగా డబ్బు సంపాదిస్తుంది సరోజ. సరదాగా మాట్లాడి, ఎదుటివారిని నిమిషంలో ఆకర్షించ గలిగే శక్తి ఆమెలో ఉన్నది. ఆమె కబుర్లు వింటూ ఉంటే కాలం గడిచేదే తెలియదు. అందుకనే ఆమె కంపెనీ కొరకు తహతహలాడిపోతూ ఉంటారు చాలామంది! ఎవరో ఒకరు 'కంపెనీ' కావాలంటూ ఆమెను లాక్కుపోతూ ఉంటారు. ఆమె మీద డబ్బులు విసురుతూ ఉంటారు.

"సరోజ ఒకడిస్పైడ్ ప్రాస్టిట్యూట్ సిరి! కాల్‌గరల్" అంటాడు కోపంగా డాక్టర్ శేషాద్రి తనతో. ఆ టాపిక్ వచ్చినప్పుడల్లా ముఖం చిట్లించుకుంటుంది ఏలిస్. సరోజ ఎన్ని కష్టాలు పడిందీ కళ్ళార చూసింది తను. సరోజ హృదయం ఎంత మంచిదో ఎలా చెప్ప గలదు డాక్టర్ శేషాద్రికి?

అదే సమయంలో 'గుడ్ ఈవెనింగ్!' అంటూ వార్డులోకి అడుగు పెట్టాడు డాక్టర్ శేషాద్రి.

"గుడ్ ఈవెనింగ్, డాక్టర్. ఇప్పుడే మీ గురించి అనుకుంటూ ఉన్నాను" అన్నది ఏలిస్ నవ్వుతూ!

"నిజం? అంత అదృష్టం నా కున్నదా?" అన్నాడు హాయిగా.

ఏలిస్ బుగ్గలు ఎరుపెక్కినవి ఆమెకు తెలియకుండా!

"సరోజ ఇంకా రాలేదు" అన్నది ఇంకేమనాలో తోచక.

"సరోజకు ఇక్కడకంటే, బయటే ఎక్కువ డబ్బులు దొరుకుతాయి కదా!" అన్నాడు.

"ప్లీజ్, డాక్టర్! ఆమె గురించి మాట్లాడటం నా కిష్టం లేదు. . . సో... డాక్టర్ వినాయక్ మీకు బోలెడు ఇన్‌స్ట్రక్షన్సు ఇచ్చారు" అని మాటల ధోరణి మార్చేసింది ఏలిస్.

ఏలిస్ చేతిలో నుండి పుస్తకం తీసి చదువుకున్నాడు డాక్టర్ శేషాద్రి.

"బెడ్‌నంబర్ టూ ఎలాగున్నాడు?"

"ఈ రోజు పరిస్థితి విషమించింది" అన్నది.

"పూర్‌ఫెలో! ఆ బెడ్ కాలీ అవ్వాలని వెయిటింగ్ లిస్టులో చాలామంది ఎదురుచూస్తున్నారు. ఎవరో కొత్త కేసును తీసుకొస్తారట! బాగా ముసలి వాళ్ళు ఇచ్చిన వారికే అని ఫోర్సు చేస్తున్నారు" అన్నాడు శేషాద్రి.

"గాడ్! మీ డాక్టర్లకు ఆత్మ అనేది ఉండదా?" అని కోపంగా అడిగింది ఏలిస్.

"ఆత్మ? అంటే ఏమిటి, సిస్టర్? ఈ ఆత్మ ఎవరి కున్నది? మాకు మాత్రం ఉన్నదా? ఉంటే మిసెస్ అర్జున్‌దాస్‌కు అన్యాయం చేసేవారా?" అతని మాటలు అంతటితో ఆగిపోవలసి వచ్చింది. వార్డులోకి గలగలా సెలయేరులా ప్రవేశించింది సరోజ.

సరోజను చూస్తూనే ప్రాణం లేచి వచ్చింది ఏలిస్‌కు.

"గుడ్‌నైట్, డాక్టర్!" అని డాక్టర్ శేషాద్రి వద్ద సెలవు తీసుకుని సరోజ వద్దకు పరుగెత్తింది ఏలిస్.

"ప్లీజ్. . . ఆమెతో. . . వెళ్ళకు, ఏలిస్!" అంటూ తనలోనే గొణుక్కున్నాడు. వెళ్ళిపోతున్న ఏలిస్ వెంబడి పట్టి అనుసరించింది డాక్టర్ శేషాద్రి దృష్టి. ఆమెను కాపాడుకోవాలనే ఆరాటం తన హృదయంలో ఏదో బాధ కలిగించింది. కానీ, నిస్సహాయుడు తను!

ఏలిస్ వద్ద ఇన్‌స్ట్రక్షన్సు తీసుకుని ఆమెను సాగనంపి డాక్టర్ శేషాద్రి వద్దకు వచ్చింది సరోజ. వెళ్ళిపోతున్న ఏలిస్ బెడ్‌నంబర్ టూ వద్ద ఆగి మరీ వెళ్ళడం ఇద్దరూ గమనించారు.

"గుడ్‌నైట్, వివేక్!" అంటున్నదా? ఎవరికీ వినిపించలేదు ఆమె సెలవు తీసు కోవడం.

"జీవితం ఒక విషాదం, సిస్టర్!" అన్నాడు డాక్టర్ శేషాద్రి నిట్టూరుస్తూ.

"ఎందుకని?" అని అడిగింది సరోజ.

"ప్రపంచమంతా మన వార్డు నంబర్ 5 లోనే నిండుకొని ఉన్నదని మీరు గ్రహించారా, సిస్టర్? మన ఈ వార్డు ఒక ట్రాజెడీలా కనిపిస్తుంది నాకు" అన్నాడు డాక్టర్ శేషాద్రి.

టెలిఫోన్ ట్రింగుమనేసరికి వారి సంభాషణకు అంతరాయం కలిగింది. సరోజ టెలిఫోన్‌లో మాట్లాడింది.

"హల్లో. . .మీరా?. . .బాగున్నాను. సో. . . గుర్తుంది. . ." సరే ఎన్ని గంటలు. . . అలాగే మ్యాడమ్!" అంటూ రిసీవర్ పెట్టి తప్పు చేసినదానిలా డాక్టర్ శేషాద్రి ముఖంలోకి చూసింది.

"స్టాఫ్!" అంటూ బాధగా అరిచాడు డాక్టర్ శేషాద్రి.

"ఊఁ. . ." అన్నది సరోజ.

"మీరు. . . మీరూ, ఏలిస్ ఎందుకు ఇలా పతనం అయిపోతున్నారు?" భరించలేక అడిగేడు డాక్టర్ శేషాద్రి.

"పతనం? హుఁ! పతనం కానిది ఎవ్వరు, డాక్టర్? మీరే కదా ఇందాక అన్నారు— ప్రపంచమంతా ఈ వార్డు లోనే నిండుకొని ఉన్నదని? పూజారికి మామూలు చెల్లించందే దేవాలయంలో దేవుని దర్శనం చేసుకోవడానికి వీలు లేదంటారు! అటువంటి దేవాలయమే మీ వార్డునంబర్ 5. హెడ్‌నర్సు ముందుగా కలిసి అతని చేతిలో కొంత ముట్ట చెప్పందే ఈ వార్డులో అడుగుపెట్టడానికి వీలులేదు కదా? నా ఎనిమిది సంవత్సరాల సర్వీసులో ప్రతి రోగి నోట నేను విన్నదే ఈ మాట! తెలియక అడుగుతాను— అయన్ని మీరు 'సిస్టర్, మీరూ దిగజారి పోవడానికి కారణం ఏమి'టని ఎప్పుడైనా అడిగారా? లేకపోతే మీ దృష్టిలో అది పతనం కాదేమో! ఇక మీ హెడ్‌అసిస్టెంట్ రామారావునే తీసుకోండి. రిప్రజంటేటివ్ ఇచ్చిన శాంపుల్సు ఇదే వార్డులో అమ్ముకుంటూ ఉండగా నా కళ్ళతో చూచాను. పోనీ, ఆ సంగతి వదిలేయండి. ఖరీదైన మందులు బెడ్‌నంబర్ 6 లాంటి రోగులకు కావాలని వ్రాసి ఇచ్చి, వాళ్ళచేత కొనిపించి, తన జేబులో వేసుకుంటాడు. బయట అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నాడు. అయన్ని నిలదీసి ఎప్పుడన్నా అడగగలిగారా మీరు, చెప్పండి? మీ దృష్టిలో అది పతనం కాదా? డాక్టర్, మీ దృష్టిలో పతనం అంటే స్త్రీ శీలం పోగొట్టుకోవడం ఒక్కటేనా? ? నా జీవితంలో ఎన్నో సార్లు పైసా చేతిలో లేక ఆకలి కడుపుతో పడుకున్నాను. నా తమ్ముళ్ళకు, చెల్లెళ్ళకు ఒక్కపూటకూడా అన్నం పెట్టలేక అవస్థపడిపోయాను. అటువంటి పరిస్థితి తలుచుకుంటేనే నా గుండె బేజారెత్తిపోతుంది. డాక్టర్, డబ్బు అవసరం అందరికీ ఉంది. పెన్సిలిన్ బాటిల్సులో ఎక్కువ నీళ్ళు కలిపి, డోసు తక్కువ ఇచ్చి మిగిలినవి బయట అమ్ముకొని కొంతమంది నర్సుల్లా నేనూ డబ్బు చేసుకోవచ్చు. రోగులను పీడించి వాళ్ళ వద్ద డబ్బు లాగవచ్చు. కానీ, డాక్టర్, నా ఆత్మని నేను అమ్ముకోలేను. నా శీలం మంట కలిసినా ఫరవాలేదు కానీ, నా ఆత్మ మాత్రం పరిశుద్ధంగా ఉండాలని నా తాపత్రయం. నా శరీరం మలిన మైనా, నా ఆత్మ మలినం కాకుండా కాపాడుకోవడమే నాకు ముఖ్యమనిపిస్తుంది. నా లాంటి వాళ్ళు ఏదో విధంగా దిగజారక తప్పదు, డాక్టర్! ఇకపోతే ఏలిస్. ఆమెను నాతో పోల్చారంటే మిమ్మల్ని క్షమించలేను! డాక్టర్ అర్జున్ దాస్‌ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నది. అతనికి ఉపశమనం ఇవ్వగల తియ్యటి ట్రాంక్విలైజర్ ఏలిస్! అందులో ఆమెకు ఏమాత్రం స్వార్థం లేదు. తనా పతనం అయిపోతున్నది? ఎన్నటికీ ఒప్పుకోదు!" అని గంభీరంగా పలికింది సరోజ.

"క్షమించండి, సిస్టర్! మీ మనస్సు నొప్పించాను. మీరు చెప్పింది అక్షరాలా నిజం! నిజంగా మన మందరమూ ప్రతి రోజూ ఏదో విధంగా దిగజారిపోతూనే ఉన్నాము" అన్నాడు డాక్టర్ శేషాద్రి బాధగా.

"అలా అనకండి, డాక్టర్! మీరింకా పతనం కాలేదు; కాకూడదని నా ప్రార్థన! మీకు తగిన భాగస్వామి లభించి మిమ్మల్ని సదా మంచి మార్గంలో నడిపించాలని దేవుని ప్రార్థిస్తున్నాను" అన్నది సరోజ.

"నాకు తగిన భాగస్వామి?. . .ఏలిస్ . . . ఏలిస్ చాలా మంచిది. . . చాలా అమాయకురాలు. . . ఆమె అంటే నాకు. . ." మాటలు పూర్తిచేయలేక పోయాడు శేషాద్రి.

"ప్చ్!" గట్టిగా నిట్టూర్చింది సరోజ. "ఏలిస్ హృదయంలో మీకు చోటు లేదు, డాక్టర్! జీవితం అంతే! మనకి కావలసింది మరొకరి చేతిలో ఉంటుంది. మనం చేయాలనుకున్నది మరొకరు చేస్తూ ఉంటారు. మనకి మన ఇష్టం లేనిదీ, మనం చేయలేనిదీ ఎదురవుతుంది! మానవుడికి జీవితంలో మిగిలిందే అసంతృప్తి. ఈ అసంతృప్తి వల్లనే మానవుడు బహుశా పతనమై పోతున్నాడనుకుంటాను."

వాళ్ళ సంభాషణకు ఉన్నట్లుండి అంతరాయం కలిగింది. ఒక ఖైదీకి విడుదల, బెడ్ షీట్ ఒక ఆత్మకు శాంతి!

"బెడ్‌నంబర్ 2 చనిపోయాడు, స్టాఫ్!" అంటూ పరుగున వచ్చి చెప్పింది స్టూడెంటు నర్సు సుభ!

తనకు తెలియకుండానే అమాంతం లేచి నిలబడ్డాడు డాక్టర్ శేషాద్రి.


"బెడ్‌షీట్ కప్పి స్క్రీన్ పెట్టు" అని సరోజ తల వంచుకొని చేతులు జోడించి ప్రార్థించింది:

"అతని ఆత్మకు శాంతినివ్వు, భగవాన్!"

సరోజను చూస్తూ డాక్టర్ శేషాద్రి కూడా చేతులు జోడించి ప్రార్థించాడు. కానీ, అతని ప్రార్థన వేరు!

"భగవంతుడా! నన్ను పతనం చేయకు. . . పతనం చేయకు. . "★


# మీరు ఏం చేస్తున్నా సరే



# మాకు మీతో తప్పనిసరిగా పని ఉంటుంది.

మీరు ఓ మాత్రను తీసుకుంటున్నా, సూటు కుట్టిస్తున్నా, జోళ్ళు ధరిస్తున్నా, లిప్‌స్టిక్ వేసుకుంటున్నా, మాకు మీతో పని ఉండడం మాత్రం ఖాయం.

మేము తయారుచేసే రసాయన సామాగ్రి బట్టలు, మందులు, పెయింట్లు, సౌందర్య సాధనాలు, తోళ్ళ ఉత్పాదనలు మొదలైన ఏ ముఖ్యమైన వస్తువుల తయారీకైనా సరే మూల పదార్థాలుగా ప్రతి నిత్యం అవసరమౌతూనే ఉంటాయి.

అంటే హైకో కెమికల్స్ కారణంగానే మీరు వాడే అనేక నాణ్యమైన ఉత్పాదనలు మనదేశంలో తయారవుతున్నాయన్నమాట.

మేము సర్ పి.సి.రే బహుమతి గ్రహీతలం HICO

హైకో ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్
మొగల్ లేన్, మాహిమ్, బొంబాయి 400 016
ఫోన్: 457231, 456053

Vision-741-TEL